క్లుప్తంగా

నేడు శ్రీనివాస కల్యాణం



సిద్ధమవుతున్న కల్యాణ వేదిక

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీనివాసుడి కల్యాణం నిర్వహిస్తున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో శనివారం ఏర్పాట్లు చేపట్టారు. ఇందుకు అవసరమై భారీ స్టేజీని సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణంతోపాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం ఎదురు సన్నాహ ఉత్సవం జరుగుతుంది. సాయంత్రం శ్రీనివాసుడి కల్యాణం నిర్వహిస్తారు. ఇందుకు అవసరమైన ద్రవ్యాలను సిద్ధం చేశారు.

పాన్‌షాప్ నిర్వాహకుడిపై దాడి

మల్కాపురం: తన కుమారుడిని కొట్టాడన్న కోపంతో ఆ వ్యక్తిపై తండ్రి దాడి చేశాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా.. 63వ వార్డు జై ఆంధ్ర కాలనీలో కృష్ణస్వామి అనే వ్యక్తి పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 9న ఇదే ప్రాంతానికి చెందిన కత్తిర కనకడు అనే వ్యక్తి కుమారుడు.. కృష్ణస్వామి పాన్‌షాప్ వద్దకు వచ్చి తనకు అవసరమైన సామగ్రి తీసుకుని డబ్బులు చెల్లించలేదు. కృష్ణస్వామి, అతడి భార్య డబ్బులు ఇవ్వమని యువకుడిని అడగ్గా.. తరువాత ఇస్తానని బదులు చెప్పాడు. డబ్బులు చెల్లించి సామగ్రి తీసుకెళ్లాలని కృష్ణస్వామి దంపతులు తెలిపారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. గొడవ విషయాన్ని యువకుడు తన తండ్రి కత్తిర కనకడుకు చెప్పడంతో అతడు కక్ష పెంచుకున్నాడు. శుక్రవారం రాత్రి పాన్‌షాప్ కట్టి ఇంటికి వెళ్తున్న సమయంలో కృష్ణస్వామిపై అతడు దాడి చేసి, గాయపరిచాడు. బాధితుడు మల్కాపురం పోలీసులను ఆశ్రయించడంతో కత్తిర కనకడును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎస్‌ఐ దేవుడమ్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో పట్టుబడిన యువకులపై కేసు

ఆరిలోవ: గంజాయితో పట్టుబడిన ఇద్దరు యువకులపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ పదో వార్డు పరిధి డెయిరీఫారం వద్ద శనివారం ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు యువకులు ట్రాఫిక్ సిగ్నల్ పడినా ఆగకుండా జూ పార్కు వైపు వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు వారిని వెంబడించి ఇందిరానగర్ వద్ద పట్టుకొన్నారు. యువకులు గాబరాపడడంతో అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న చిన్న బ్యాగ్‌ను తనిఖీ చేశారు. అందులో సుమారు అర కిలో గంజాయి లభించింది. దీంతో వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం.. ఆటవిడుపు



వ్యాయామం చేస్తున్న బాలికలు

- నరికొత్తగా గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి
- వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ పార్క్, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు
- వేసవిలో సందడి చేస్తున్న పిల్లలు



గ్రీన్‌బెల్ట్ పార్క్‌లో ఆడుకుంటున్న చిన్నారులు



గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్

విశాఖ విద్య: జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ఒకప్పుడు పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉండేది. అటువైపు వెళ్లేందుకు భయమేసే పరిస్థితి. ముందుబాబులకు అదో అడ్డా. రోజులు మారాయి. గ్రీన్‌బెల్ట్ ఏరియాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, నిధులు కేటాయించింది. ఎన్‌ఏడీ సెంటర్ మొదలుకొని నగరంలోని మద్దిపాలెం జంక్షన్ వరకు గ్రీన్ బెల్ట్ కొత్త అందాలు సంతరించుకుంది. వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాలతో ఇవి ఓపెన్ జిమ్‌లుగా మారాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో జనసంచారంతో సందడిగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు ఆడుకునేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి.

రా.. రమ్మంటూ ప్రజలకు ఆహ్వానం

విశ్వనగరమైన విశాఖకు స్వాగతం పలికే ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ దాటిన వెంటనే ఉన్న గ్రీన్‌బెల్ట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారు. రాత్రి 8 గంటల వరకు ఇక్కడ వేచి ఉండేలా ఆధునికమైన ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. గ్రీన్‌బెల్ట్ చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసి, వాటికి లైటింగ్ అమర్చడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ కాంతులీనుతున్నాయి. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో జిందాల్ బిల్డింగ్, అపర్ణ అపార్ట్‌మెంట్, పాస్‌పోర్ట్ ఆఫీస్, నవ్యాంధ్ర స్కూల్, మారియట్ హోటల్ ఎదురుగా ఉన్న గ్రీన్‌బెల్ట్‌ను అందంగా అభివృద్ధి చేశారు. వీటిలో స్థానికులు, సందర్శకులు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం గ్రీనరీ పెంచుతుండటంతో అటుగా వెళ్లే వారిని రా...రమ్మంటూ ఆహ్వానం పలుకుతున్నాయి.



ఎన్‌ఏడీ గ్రీన్‌బెల్ట్‌లో ఓపెన్ జిమ్ పరికరాలు



ఆట పరికరాలపై పిల్లలను ఆడిస్తున్న తల్లిదండ్రులు

వాసవీ కన్యకాపరమేశ్వరికి వైభవంగా పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు



శాస్త్రీయ నృత్యంతో అలరిస్తున్న చిన్నారులు

గోపాలపట్నం: స్థానిక కుమారి కల్యాణ మండపంలో శనివారం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఉదయం 8 గంటల నుంచి శాస్త్రోక్తంగా అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ముందుగా చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు భక్తులను పరవశింపజేశాయి. పూజల అనంతరం భక్తిపాటలతో అలరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలను గుణిశెట్టి శ్రీనివాసరావు దంపతులు అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరాలయంలో విశేష పూజలు



స్వామివారి నామార్చనలో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

గోపాలపట్నం: కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి అభిషేకాలు, అర్చనలు చేశారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

ఘనంగా ఎర్నిమాంబ తొలేళ్ల సంబరం



అమ్మవారి ఘటాలతో వస్తున్న భక్తులు



గుర్రపు రథంపై ఊరేగుతున్న ఎర్నిమాంబ

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ ఆలయం వద్ద అమ్మవారి ఘటాలతో బయలుదేరారు. కొబ్బరితోట, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట, రైల్వేస్టేషన్, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం పుట్టబంగారం వద్దకు వాటిని చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. అనంతరం ఆలయం వద్ద మాలధారులైన భక్తులు అగ్నిగుండాలు తొక్కారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కుంతీ మాధవ స్వామి చందనోత్సవం నేడు



కుంతీ మాధవ స్వామి విగ్రహం



మామిడి తోరణాలతో అలంకరించిన ఆలయ లోపలి భాగం

పద్మనాభం : పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం చందనోత్సవం నిర్వహణకు ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కుంతీ మాధవ స్వామిని అలంకరించడానికి అవసరమయ్యే చందనాన్ని సమకూర్చారు. కుంతీ మాధవ స్వామిని శనివారం రాత్రి పది గంటలకు ఆలయ అర్చక స్వాములు చందనంతో అలంకరిస్తారు. ఆదివారం ఉదయం ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం ఏడు గంటల నుంచి చందనం అలంకరణలో ఉన్న స్వామిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రవేశం కల్పిస్తారు. రెండు రోజుల వరకు కుంతీ మాధవ స్వామి చందనం అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ లోపలి భాగాన్ని, రాజగోపురం ముందు భాగాన్ని మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. కుంతీ మాధవ స్వామి ఆలయం ముందు భాగంలో అరటి చెట్లతో అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవం



వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవంలో పాల్గొన్న భక్తులు

గోపాలపట్నం: వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. బంటా కాలనీలో సంహాచల్ నగర్ విరాట్ శ్రీ విశ్వకర్మ సేవా సంతి ఆధ్వర్యంలో పూజలు చేశారు. విజయనగరానికి చెందిన వేద పండితులు లావేటి సంతోషాచార్యులు, కొమ్మోజు రవి ఆచార్యుల వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సేవా సమితి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

జూ.. సందర్శకుల క్యూ



జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు

ఆరిలోవ : వేసవి సెలవులు కావడంతో ఇందిరాగాంధీ జూ పార్కుకు సందర్శకుల తాకిడి పెరుగుతోంది. పాఠశాలల విద్యార్థులు ఎక్కువగా జూ పార్కును సందర్శించారు. కొంతసేపు వన్యప్రాణులను తిలకించి ఎంజాయ్ చేశారు. ఇక్కడ వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద వారంతా గంటల తరబడి సందడి చేశారు. నీటి ఏనుగులు, తెల్ల పులులు, కోతులు, లవ్ బర్డ్స్, వివిధ రకాల పక్షులు, జిరాఫీలు, అడవి దున్నలు నెమళ్లు, ఏనుగులు సందర్శకులను అలరించాయి. వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ కనువిందు చేశాయి. పిల్లలు, పెద్దలు వన్యప్రాణులను ఫొటోలలో బంధించారు. కొందరు వాటి ఎదురుగా వెళ్లి సెల్ఫీలు దిగారు. దీంతో జూ పార్కు సందడిగా మారింది.



కొలనులోకి దిగుతున్న నీటి ఏనుగులు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

ఘనంగా సహస్రనామార్చన

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బీచ్‌రోడ్డు: విశాఖ వేదికగా జూన్ 2న ఎంబీఏ, పీజీడీఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగబోయే మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారితోపాటు చివరి ఏడాది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు https://mat.aima.in వెబ్ సైట్‌ను సందర్శించి ఈ నెల 28తేదీ లోగా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

'ఎంఈఎస్' ఇంజినీర్ల సమస్యలు పరిష్కరించాలి

సీతంపేట: ఎంఈఎస్‌లో పనిచేస్తున్న సివిలియన్ ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపి తమకు రావాల్సిన బెనిఫిట్స్‌ను ఎటువంటి వివక్ష లేకుండా అమలు చేయాలని ఆల్ ఇండియా సివిలియన్ ఇంజినీర్స్ అసోసియేషన్ కోరింది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కె.రాధాకృష్ణ, సంజీవ్ సుమన్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం తమకు ఏఈ నుంచి ఈఈ క్యాడర్ వరకు ప్రమోషన్ ఇచ్చేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 124 మంది పదోన్నతులు పొందారని చెప్పారు. సర్వేయర్లకు ఇంజినీరింగ్‌తో అనుసంధానం చేస్తూ వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. గ్రేడ్ పే మొత్తాన్ని పెంచాలని, సివిలియన్లకు టైప్ 3, 4 క్వార్టర్లు నిర్మించాలని, కార్యాలయంలో మెస్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు చతుర్వేది, నితీష్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



తులసీదళార్చనలో సిరులతల్లి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశం

జగదాంబ : చెత్త కుప్పలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ అన్నారు. శనివారం జోన్ పరిధిలో 35వ వార్డులో పర్యటించారు. పందుపుల్లల సందు, వన్‌టౌన్ ప్రధాన రహదారి, పూర్ణామార్కెట్ ప్రాంతాలను పరిశీలించారు. రహదారి పక్కన ఉన్న చెత్త కుప్పలను పారిశుధ్య సిబ్బందితో ఎత్తించి డంపింగ్ యార్డుకు తరలించారు. వార్డులో రహదారులు, కాలువలు పరిశుభ్రంగా ఉండాలని వార్డు ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్మికులకు ఆదేశించారు. కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ లేకుండా పరిశుభ్రం చేస్తే ఎక్కడా మురుగు, నీరు నిల్వ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా మరుగుదొడ్లు

జీవీఎంసీ 39వ వార్డులో ప్రజా మరుగుదొడ్లను జోన్-4 ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్ శనివారం పరిశీలించారు. మరుగుదొడ్లలో కచ్చితంగా నీటి సదుపాయం ఉండాలన్నారు. ఫినాయిల్, బ్లీచింగ్ వంటివి ఎప్పటిప్పుడు వేసి దుర్వాసన లేకుండా చూడాలన్నారు. మహిళలకు ఇబ్బంది లేకుండా మహిళల మరుగుదొడ్ల వద్ద మహిళలే ఉండాలన్నారు.

పరిపాలన విభాగాల పరిశీలన

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలోని పలు విభాగాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ శనివారం పరిశీలించారు. పరిపాలన భవనంలో పనిచేస్తున్న విభాగాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కార్యాలయాల ఆధునికీకరణ, అవసరమైన మార్పులు చేపట్టడం, మరమ్మతులు, తదితర అంశాలపై సిబ్బంది సూచనలు స్వీకరించారు. ప్రతీ విభాగాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించడం, విద్యార్థులకు, ఉద్యోగులకు మరింత సమర్థంగా సేవలు అందించడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ వెంట అధికారులు సాంబమూర్తి, గోపాల కృష్ణ, రమణా రెడ్డి, తులసీరామ్, ఇమాన్ ఉన్నారు.



కార్యాలయాలు పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

హుండీ ఆదాయం రూ.1.41 లక్షలు



నీలమ్మ వేపచెట్టు అమ్మవారి హుండీల ఆదాయం లెక్కిస్తున్న అధికారులు

అల్లిపురం : అస్సాంగార్డెన్స్‌లోని నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం ద్వారా 1 లక్ష 41 వేల 224 రూపాయలు లభించినట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఈ మొత్తం రెండు నెలలకుగాను లభించిందన్నారు. శనివారం దేవాలయం ఆవరణలో దేవదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ పీఎల్ఎన్ రాజు సమక్షంలో హుండీలు లెక్కించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు జోగారావుశర్మ, శ్రీ హరి సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.